చందమామ వెన్నెలలో చుక్కలు వెలవెలపోతాయి. కానీ కటికచీకటిలో చుక్కల చక్కదనం మిడిసిపడుతుంది. అవే కాస్తంత దారి చూపిస్తాయి. మనిషి బ్రతుకూ అంతే. కాని, చుక్కల్ని నమ్ముకుని, చందమామను వదులుకోవడం ఎంత అవివేకం ... చందమామలాటి చల్లని ఇల్లాల్ని, ఇంట్లో ఉంచుకుని, తిరుగుళ్లు మరిగితే ... మనిషికి విలువ ఏమిటి? మనసుకు ఊరట ఏమిటి?

---

కోటిగాడు మళ్లీ తాగి వచ్చేడు. మళ్లీ అంటే రెండోసారో మూడోసారో కాదు. బతుకులో రాజమ్మ తారసపడ్డ నాటినుంచి వాడు తాగుతూనే ఉన్నాడు. ఇటీవల వాడికి తాగటం, తిండీ, బట్టా, వెంకటలక్ష్మి ప్రేమా, రాజమ్మ వగలూ లాగే రోజూ ఉండవలిసిన వాటిల్లో ఒకటయింది. అయితే వాడు తాగినా అల్లరి చేసేవాడు కాదు. ఎప్పుడన్నా అలివి దప్పితే వెంకటలక్ష్మికి నాలుగు తగిలేవి. వెంకటలక్ష్మి వాడు తాళిగట్టిన ఇల్లాలు. దానికి వాడంటే వల్లమాలిన ప్రేమ.

కోటిగాడు తాగి గుడిసెలోకి వచ్చేపాటికి సంజవేళయింది. లోకానికి చీకటి నల్లని ముసుగేసి మత్తులో జోకొట్టుతూంది. గాలి విసురుగా వీచి గుడిసె మీద తాటాకులు కదులుతున్నాయి. రామాలయం ఎదురుగా చెట్టుమీద పక్షులు గూళ్లు చేరుకొని విపరీతంగా అల్లరిచేస్తున్నాయి. చెటు కింద పడుకొన్న కరణం గారి ముసిలెద్దు నెమరేస్తూ, గతాన్ని వర్తమానంతో పోల్చుకొంటూంది. తండాలో తాగిన వాళ్ల పొలికేకలు కలగాపులగంగా వినిపిస్తున్నాయి. కంసాలి బత్తుడు వీరయ్య మూడో కొడుకు గుడ్డిదీపం ముందు కూచొని ఎక్కాలు చదువుతున్నాడు.

కోటిగాడు గుడిసెలోకి అడుగుపెట్టేడు. పొయ్యి మీద గిన్నెలో అన్నం ఉడుకుతూంది. విచిత్రంగా గెంతుతున్న మంటల కణుగుణంగా గోడమీద నీడలు కదులుతున్నాయి. వెంకటలక్ష్మి పొయ్యి కెదురుగా కూచొని మంట ఎగసనతోస్తూంది. మంట వెలుగులో దాని ఎర్రని ముఖం మరీ ఎర్రగా కనిపిస్తూంది. రేగి ముఖంమీద పడుతూన్న జుట్టును కుడిచేతి వేళ్లతో వెనక్కి తీసికొని, పక్కనున్న గిన్నెలో నీళ్లు పోసి తొలిచింది.

గాల్లో గుప్పుమని సారాయి వాసన వ్యాపించి ముక్కులకు సోకగానే వెంకటలక్ష్మి వెనక్కి తిరిగింది. వాకిట్లో చతికిలబడిన కోటిగాడు కనిపించేడు.

"ఈ ఎదవలవాటు జలమలో పోదుగందా! ఎన్ని తడవలు చెప్పేది? మడిసికో మాట, గొడ్డుకో దెబ్బ అన్నారు." చిరాకుతో అని మరి రెండు పుల్లలు పొయిలోకి పెట్టింది.

కోటిగాడు నవ్వేడు. వాడిట్లా నవ్వితే, ముఖ్యంగా ఇలాంటి సందర్భాలల్లో వెంకటలక్ష్మికి చాలా చిరాకు వేస్తుంది. ఆ నవ్వుచూస్తే దానికి వాణ్ణేమన బుద్దవదు. వాడి నవ్వులో ఏదో మత్తుంది.

"పిట్ట కూతకొచ్చిందే! నే తాగితే నీకేమయిందంట? కట్టపడి సెమటోడ్చి సంపాయించు కొంటున్నాను. కర్చుసేసుకొంటున్నాను." కసిరి, తుపుక్కున ఉమ్మేసేడు గోడమీద.

"ఓరుకేం బట్టింది? ఇంటిదాన్ని గనక నాకు తప్పదు. నేనన్నానని గుసెందుకు? పేసే ఎని పెబ్బరదయినప్పుడు."

"ఓయబ్బ సెప్పొచ్చింది! నేనేం తప్పుసేస్తున్నానా? తాగి ఓర్నన్నా ఎదవకూతలు కూస్తే తప్పు. నేనేమన్నా ఓరి జోలి జోక్యం పట్టించుకుంటున్నానా! నాకు తెలీ కడుగుతాను, ఊళ్లో ఎదవలందరికీ నా ఊసెందుకే?" కోటిగాడు చెవిలోనుంచి సగం కాలిన బీడీముక్క తీసేడు.

"ఎవరేవన్నా రేంటి?" గిన్నెలో అన్నం మెతుకును వేలితో చిదిమి ఉడికిందీ లేందీ చూస్తూ అడిగింది వెంకటలక్ష్మి.

"ఓరైనా అంటారు. ఆళ్ళకేం?" లేచివచ్చి పొయ్యిలో కొరకాసుతో బీడి ముట్టించుకొని అన్నాడు. "ఇందాకమటుకిందాక, ఇంటికేపొత్తుంటే మునసబు ఎదురు పడ్డాడు. ఎంతజెడ్డా పెద్దమడిసి గదా అని తప్పుకొంటే, పక్కకు తిరిగి తుపుక్కున ఊసి, 'ఎదవా! ఈ జలమకు బాగుపడవురా నువ్వు! ఈ తప్పుడలవాటు నీకేనాటికి పోతదిరా? బంగార బొమ్మలాంటి పిల్లన్ని యెదాన కొట్టి సచ్చింది నీ మేనత్త. నువ్వేమో తప్పతాగి దానిగడపాదలవ్! ఛి, పో! నీ ముకం చూపించమాక' అన్నాడు. నాకు యాడమండాలో ఆడ మండి నోటిదాకా వచ్చినాది. 'తాగటం, మనసువడ్డ గుంట కాడికి బోవటం తప్పా? ఇట్టంలేని ఆడకూతుర్ని రేత్రికి రేత్రి ఒంటరిగా దొడ్డికాడ చెరసటం ఒప్పా? కట్నంలో తిరకాసొచ్చిందని కోడల్ని పుట్టింటికి తోలి ఆ మాలచ్చిమి ఉసురుపోసుకోటం మంచిదా?'' అని. పెద్దోడని తగ్గేను. లేకపోతే, ఊళ్లందరికీ నా ఊసెందు కంట, ఇంకేం పన్లేనట్టు!' పై పంచె తీసి తలకు చుట్టుకొంటూ ముగించేడు కోటిగాడు.

అంత చిరాకులోనూ వాడి బుంగమూతి చూస్తే నవ్వొచ్చింది వెంకటలక్ష్మికి. చిర్నవ్వు దాచుకొంటూ ముఖంలోకి రవంత కోపం తెచ్చుకొని, అంది, "సాల్లేస్లే! ఓర్ని బడితే ఆర్ని నోటికొచ్చినట్లంటమే! ఆళ్లకేం మారాజులు. మద్దెన మనకేటికి?"

"నాకూ తెల్సులెయ్యే! ఆయనేం జేసికొంటే నాకేటి? తప్పు సేసే ఎదటోడి తప్పులెన్నటం

**హిమబిందు**

చూస్తేనే నాకు పెద్ద సిరాకొత్తది. అయినా ఓరో యెదో కూస్తే నాకేమయ్యిందంట? ఛే! ఛే! కూడెట్టు."

"ఏం? రాజమ్మ తొందరగా రమ్మందేంటి?" గుడిసె కన్నంలోంచి తొంగిమాసే చుక్కకేసిచూస్తూ అడిగింది వెంకటలక్ష్మి.

"నా సామిరంగా! నీకూ అలుసయ్యే! ఛే! ఛే! కడుపు మండిపోతుండాది."

వెంకటలక్ష్మి గూట్లో జర్మన్ సిల్వర్ కంచం తీయటానికి లేచింది.

* * *

అన్నాలు తింటం కాగానే ఆ జానెడు గుడిసె బాగుచేసికొని బయటకి వచ్చింది వెంకటలక్ష్మి. కోటిగాడు మంచంమీద పడుకొని ఆకాశంలో మెరిసే చుక్కలకేసి చూస్తున్నాడు. వెంకటలక్ష్మి తడిచేయి పమిట చెంగుకు తుడుచుకొని వాడి పక్కన మంచం మీద కూచుంది.

కోటిగాడు దానికేసి తిరిగేడు. చీకట్లో ముఖం కనిపించలేదు.

"ఆడున్న సుక్కలన్నీ ఎన్నాళ్ళనుంచో అట్టానే ఉన్నయ్ గందా! వాటికే గనక మాటలొత్తే నా సామిరంగా! బూమ్మీద జరిగే తప్పుడు పనులన్నింటినీ పెద్దమడుసుల ముందు బయటపెట్టవ్?"

ఆ విషయం వాడిందాకటినించి ఆలోచించేడు. వాడి ఊహ వాడికానందాన్నిచ్చింది గూడాను.

"ఇయ్యాలేందో బులోడు యేదాంతం మాట్టాడుతుండే! రాజక్క ఊళ్ళోలేదేంది?" వాడిమీదచెయ్యేస్తూ పరాచికమాడింది వెంకటలక్ష్మి.

"సీత్తేరి! అడిగిందానికి జవాబు సెప్పు. ఇప్పుడు దాని ఊసెందుకు?" కసిరేడు.

"ఓ యబ్బో! రోసం!" నవ్వుతూనే అని, ఓ క్షణమాగి, వాడన్న విషయం గుర్తుకు తెచ్చుకొంటూ అంది.

"అంతలేసి మాటలు నాకేడ తెలుత్తయ్ గాని అయినా సుక్కలు సెబితే ఓరితప్పు నలుగురికీ సెప్సేసేవేమో! మొదటి సంగతి, తప్పుజేసేవాడికి తెల్దా? ఆడుచేసే తప్పుడు పనిని చేసేవోడికి తెలిస్తే ఇంక ఆడికి సుకమేది? కడుపులో కడుపులో కుళ్లిపోడూ? ఆణ్ణి సూడ్రాదూ! కావిలి రంగడు. పెళ్ళాన్ని సంపింది ఆడే. గుట్టుగా గొంతుపికికి, తాడుకేలదీసి ఉరేసుకుందాన్నాడు. ఓరికీ ఇసయం తెలీదనుకొన్నాడు. ఆడికి తెలుసుగందా ఆడుచేసిన దురమారగం. నెల తిరక్కుండానే కాలిక్కురుపు లేచింది. మంచాన బడ్డాడు. నీళ్లకెళ్లేప్పుడెప్పుడన్నా, "ఎట్లగుందన్నా?" అంటే, కళ్లమ్మట నీళ్లెట్టుకోని, "నన్నట్లా అడక్కే యెంకట్లచ్చిమి. నాక్కావాలిసిందేదో అయ్యింది. లచ్చిమీ! యెర్రిఎదవలం అనుకుంటాంగాని, దేముడున్నాడే! ఆడన్నీ సూతూ్తనే ఉంటాడు. ఓరికర్మ వాళ్లనుఁగించాల్సిందే. నాకి తగ్గదు. పురుగులు పడిపోతా సూడు!" అంటాడు. ఏవిటోపాపం. ఆ ఈరి నిప్పులాంటాడది. ఈడో అనుమానప్పిశాచి. లచ్చిగాడితో దీనికేదో ఉందని సంపేడు. యథార్థానికి ఆ లచ్చిగాడు దీన్నక్కలా సూసుగునేవోడు. నా కెరికేగా!"

కోటిగాడు బీడీపొగ గుప్పుగుప్పున వదులూ్త, చుక్కలకేసి చూపు తప్పించకుండా, ఇల్లాలు చెప్పింది


సేవలు
Anjaneyulu

శ్రద్ధగా విన్నాడు. వెంకటలక్ష్మి చెప్పింది బాగానే ఉంది కాని వాడికి తృప్తి కలిగించలేదు. కుడిచేతి మోచేతిమీద లేచి వెంకటలక్ష్మికేసి తిరిగి అన్నాడు.

"నువ్వంది రైటే! అయితే నాకో సందేగం వత్తాంది. ఏ తప్పుసేసినా బీదోడికే కట్టాలు. రంగడు కూటికి లేని ఎదవ గనక వాడి కుష్ఠురుపమైతే బాగు సేయించుకోలేక సస్తున్నాడు. ఆ డెప్పుడూ ఇట్టాంటి దురమారగప్పనులు సేసినోడు కాకపోవటం సేత మనసు పీకి కడుపులో కుళ్లిపోతన్నాడు. ఆడుసేసిన తప్పుకు దేముడు శిచ్చేసేడనుకొందాం. బాగనే ఉంది. మరీ దొంగనాయాలు మునసబు సంగతేంది? ఆడు పంతులు పెళ్లాన్ని బలవంతం సెయ్యలే! సీతమ్మోరు లాంటి ఆ ఇల్లాలు బాయిలోపడి పానం దీసుకొందా! కట్నంకాడ పేసీ వొచ్చి కోడల్నింట్లోంచి గెంటేడా! పెసిడెంటును కూనీ చేయించిం దీడేనని ఊళ్లో అందరికీ తెలుసుగందా! మరాయన్నుజూడు. మారాజులా తిరుగుతుండే! అందరూ ఆయన కొంగొంగి దండాలు బెడుతుండరే! సివరికి, దానెమ్మ సిగదరగా! పంతులాయనద్గిగ్గరే గుమాస్తా ఆయ! మరి మునసబు బాదపట్నం లేదేం? తప్పు పేసినాడుగా!"

చివరి గుక్క పీల్చి బీడి అవతలకి గిరాటేసేడు.

వాడు చెప్పిందంతా శ్రద్ధగా ఆలకించాక వాడి వాదమంతా నిజమేననిపించింది వెంకటలక్ష్మికి. 'మరి ఆడన్నట్టు మునసబు బాదపడ్డేం? కడుపులో బాద పడుతున్నాడా? ఏమో! ఆ మునసబు ముకం సూస్తే అట్టాగనిపించదు. మరేందీ సిత్రం?' వెంకటలక్ష్మి కర్థంకాలేదు.

దాని మనసులో అనుమానం తెలిసికొన్నట్లు అన్నాడు కోటిగాడు, "డబ్బే! డబ్బు. ఆ లచ్చిమొకటుంటే మడిసేం జేసినా సెల్లద్ది. బూతుల్దిట్టినా జనం ఒంగొంగి దండాలు బెడతారు. డబ్బులేకపోతేనే ఈ తిప్పలన్నీ!"

"కావిద్దూ! పెపంచకం అన్నాక బోలెడు. ఇయన్నీ మన మెక్కడ సూత్తాం? అన్నీ ఆ పైవోడే సూసుకోవాల. మనం మంచిగా ఉంటే సాలదూ! ఓరి ఊసెందుకు?"

వెంకటలక్ష్మి రాజీపడింది.

బాగా చీకటి పడింది. కృష్ణపక్షం. చుక్కలు కడిగిన ముత్యాలకు మల్లే స్వచ్ఛంగా మెరుస్తున్నాయి. రావి చెట్టుమీద పక్షేదో వికృతంగా కేకేసింది. ఎవరింట్లోనో ఎదయిన పడ్డ ఒకటే మోయిన అరుస్తాంది. బయటెవరో పెట్రొమాక్సు లైటు తీసికెళ్లేరు. గోడ మీద చెట్టు నీడ క్షణం కిందికీ పైకీ ఊగి మాయమయింది.

కోటిగాడుమాత్రం సుక్కలకేసే చూస్తున్నాడు. అల్లా చూస్తూ ఉంటే, బయటకు చెప్పటానికి చాత కాని ఆలోచనలెన్నో వాడి బుర్రలో తిరగటం మొదలెట్టేయి. ఓ నిమిషాన వాడి కనిపించింది, 'సందమామున్నప్పుడు సుక్కలింత బాగుండవు! సుక్కలుగూడా సీకట్లో అందంగా మెరుత్తయ్. మినుకుమినుకుమంటూ గూడా సిమ్మసీకట్లో కూత్తంత దారి సూపిత్తయ్. మడిసన్నాక అట్టగుండాలి. ఆడివల్ల ఎదటోడికి రవంతయినా మంచి జరగాల. ఏందో! ఇయ్యాల పెద్ద ఆలోచన లొత్తుండాయే' మనసులోనే నవ్వుకొన్నాడు.

కోటిగాడి పక్కకు తిరుగుతూ అంది వెంకటలక్ష్మి, "ఏం? ఇయ్యాల ఇల్లు దాటలేదూ? అవి గాని రావొద్దందా?"

"గుండెలే? నాకే ఇప్పుడు పోబుద్ధికావటంలే! పడుకో!"

వెంకటలక్ష్మి లేచింది, లోపలకెళ్లి చాప తెచ్చుకొనేందుకు. వాడు రాజమ్మ ఇంటికి వెళ్లకపోవటం దానికిమాత్రం విచిత్రమే! రాజమ్మతో పరిచయం అయిన ఈ నాలుగు ఏళ్లలోను వాడు దానింటికి వెళ్ళంది మూడుసార్లే! వాళ్లమ్మ పోయినప్పుడొకసారి పోలేదు. వెంకటలక్ష్మికి విపరీతంగా కడుపులో నొప్పి వచ్చిన రాత్రి రెండవది. ఇది మూడో రాత్రి.

"కడుపులో సింత పట్టం లేదుగందా!' మనసులో అనుకొంది వెంకటలక్ష్మి.

వాడివేవీ పట్టించుకోకుండా, మినుకు మినుకుమనే చుక్కలకేసిచూస్తూ ఎవరికీ అర్థంకాని బ్రతుక్కి అర్థం ఆలోచిస్తున్నాడు.

* * *

ఆ మరునాడు మునిమాపు వేళ వెంకటలక్ష్మి పొలంనుంచి తిరిగి వచ్చేసరికి కంసాలి వీరయ్య ఇంటి ముందు జనం గుంపుగా మూగి ఉన్నారు. సన్నగా ఏడుపులు వినిపిస్తున్నాయి. ఎవరికేం ముంచుకొచ్చిందోనని పరుగెత్తుకెళితే వాకిట్లో స్నానం చేయిస్తున్న వీరయ్య శవం కనిపించింది. నోట మాటరాలేదు.

'నిన్న గూటుమల్లే తిరుగుతూండె. అంతలో కేం ముంచుకొచ్చిందో? ఏందో అనుకోటమేగాని ఎదవ జలములు' వెంకటలక్ష్మి మనసులో శూన్యభావాలు కలిగేయి.

కాసేపక్కడ నిల్చుని, ఇంటికొచ్చి, పొయిమీద అన్నంబెట్టి, స్నానంచేసి చీరె కట్టుకొంటున్న వేళకు గుడిసెలో సారాయి కంపు తేలింది.

"కరమ! అయినా నీకు రోజూ సెప్పటం నా బుద్ధి తక్కువగాదూ! సరే! ఈ ఎదవ ఊసుకేంగాని ఈరయ్య పోయినాడు. సూసొచ్చినావా?"

కోటిగాడు మాట్లాళ్లేదు. వాడివ్వాళ కావాలనే అతిగా తాగేడు. మనిషి బాగా తూలుతున్నాడు. కండ్లు ఎర్రగా మండటం ఆ గుడ్డిదీపపు వెలుగులో కూడా స్పష్టంగా కనిపిస్తాంది. మనిషిలో బండతనం ప్రస్ఫుటిస్తాంది. తేన్చినప్పుడల్లా తెరలు తెరలుగా గాల్లో సారాయి కంపు ఉద్ధృత మవుతూంది.

"అలిసిదప్పినాడు. ఏం ముంచుకొచ్చేనో?" భయం భయంగా మంచం వాల్చి, కూచో! అంది, వెంకటలక్ష్మి.

"కూచోటానిక్కాదొస్తి! మెళ్లో ఆ నాంతాడిట్టాగిచ్చేయ్" కటువుగా అన్నాడు వాడు.

వెంకటలక్ష్మి గుండెల్లో రాయిపడింది. ఇది కొత్త మలుపు. ఇంతవరకెప్పుడూ వాడు దాన్ని నగ ఇమ్మని అడగలేదు. ఇవ్వాళడిగాడంటే! . . .

వెంకటలక్ష్మి ఆలోచనలో పడింది. 'అంటే అదే తెమ్మన్నెప్పుండాలి. తనకు తెలుసు, దాని మీద వాడికి మోజెక్కువ. ఇత్తే? దాని బుద్ధి తనకు తెలీక పోతేగ! ఎదవ బుద్ధి. సొమ్ము బంగమవుద్ది. సొమ్ము కోసం కక్కుర్తిపడే ఆడదానికి మగాడిమీద మోజేముంటది? ఇది కాత్తా పోయ్యేక ఏంజేత్తాడు? ఏమైనా నగ ఇవ్వకూడదు. వాడికోసం వస్తే రానీ నాక!'

"ఏం అట్టా గుడ్లు మిటకరిస్తావ్? ఇయ్ నగ" వాడి కండ్లలోకి పశువు వచ్చింది.

"నేనియ్యను. దాని ఎదాన కొట్టటానికేగా! సొమ్ముకోసం కక్కుర్తిపడ్డ ఆడదాంతో తిరగటానికి సిగ్గెయ్యటంలే! ఛీ! నేచ్చినా ఇయ్యను."

"ఛత్! కబుర్లు సెబుతుండాది. నువ్ కక్కుర్తిబడి కాదేంటి నగ ఇయ్యనంట! దాన్నంటావేం! ఈ యేసాలు నాకాడ పడవ్. ఇయ్ ముందు" వాడు రెచ్చిపోతున్నాడు.

ఇక ఆ తరవాత జరగబోయేది తనకు తెలుసు. అయినా సరే! సొమ్ము వదులుకోగూడదు. చచ్చేనాడు అమ్మ తన మెళ్లోయేసి, "నన్ను గుర్తుబెట్టుకోయే

# ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

## ముఖ్య గమనిక

మాకు పంపే వ్యాసాలు, కథలు, చిత్రాలు వగైరాలతోపాటు తగినన్ని స్టాంపులు అంటించి, తమ అడ్రసు వ్రాసిన కవరు పంపాలి. అలాంటప్పుడే ప్రచురించలేనివాటిని వెనక్కు పంపడం జరుగుతుంది.

ఆమోదించినవాటి విషయం వారికి తెలియపరుస్తాము.

స్టాంపులతోడి కవర్లు పంపకుండా తర్వాత నాటి విషయమై ఉత్తరాలు వ్రాస్తే ప్రయోజనంలేదు.

—ఎడిటర్

లచ్చివి!" అని కళ్ళమ్మట నీళ్ళెట్టుగుంది. అంత ఇలవైన దాన్ని ఆ పచ్చి యెదాన కొట్టటమే! ఉహూ!

"నేనియ్యను."

"ఇయ్యవూ!"

చాచి గూబమీద కొట్టేడు వాడు. ఆ విసురుకు గోడకెళ్ళి కొట్టుకుంది. మళ్ళీ వీపుమీద గుద్దేడు. నేల కరుచుకొంది. చిలక్కొయ్యకున్న చేంతాడు తీసికొని చేతులు నొప్పెట్టేందాకా గొడ్డును బాదినట్లే బాదేడు. వెంకటలక్ష్మి నోరెత్తలేదు.

కోటిగాడికి ఓపిక తగ్గింది. బుసలుకొడుతూ ఓపిక చేసికొని జుట్టుపట్టుకు లాగి "ఇయ్యవూ!" అని మళ్ళీ అడిగేడు.

"ఇయ్యను. మా అమ్మ నాకిచ్చిన్దగను దాని దాన కొట్టటానికి సిగ్గులేదూ! అంత మనసుపడితేసేయించుకోరాదూ!" మాటల్లో మానాభిమానాలకోపమూ, అవమానంతో జాలితో అంది.

"ఛీపో!" కాండ్రించి ఉమ్మేసి వెంకటలక్ష్మిని కిందికితోసి, వీధి తలుపు తీసికొని చీకట్లో కలిసిపోయేడు.

కంసాలి వీరయ్య ఇంట్లో నించి గొల్లున ఏడుపులు మొదలయి నిశ్శబ్దాన్ని నలికించసాగాయి.

* * *

బయటకురాగానే చల్లటి రొజ్జగాలి కోటిగాడి ఒంటికి కరచింది. నరాలు జివ్వుమని లాగేయి. ముఖం మీద చన్నీళ్ళు చల్లినట్లయి కైపు కొంచెం దిగింది. ఈ క్షణాన వాడికి వెంకటలక్ష్మిమీద పీకవరకు కోపము, తన అసమర్థతమీద అసహ్యము కలిగేయి. చీకట్లో కలిసిపోయి నడుస్తూ అనుకోసాగేడు.

"ఛత్! ఆ నగ నా రెక్కలకష్టం కాకపోయె! వాళ్ళమ్మ దానికిచ్చిందాయె! ఆడగూతురు సొమ్ము తనెట్టా లాక్కురాగలడు? మంచిమీదిస్తే గొడవే లేదు. యువ్వారం సెయిదాటితే! ఛూత్. ఈ ఆడోళ్ళ!"

దారికడ్డంగా పడుకున్న కుక్కను లాగి డొక్కలో తన్నేడు. ప్రాణం కడబట్టిన అది నీరసంగా అరిచి రెండు గజాలవతల పడింది. వాడికిప్పుడు జాలేసింది, ముందు కుక్కమీద, తరవాత వెంకటలక్ష్మిమీదా!

తాగి మత్తెక్కిన మెదడుకు ఆలోచనలు ఓ క్రమంగ రావటం లేదు. అయినా అన్నీ తలపుకు తెచ్చుకొంటున్నాడు. 'ఈ రాజి! తన సంపాదనలో సగం దానికే కర్చు బెడుతున్నాడు. ఎంకట్లచ్చిమి ఎర్రిమొగం. ఏనాడూ ఇదేందనడగలేదు. అదీ కూలికీ, నాలికీ పోయొస్తుంది నక కొంప బజార్న పట్టంతే! కాని రాజమ్మంటే తనకు వల్లమాలిన కుతే! దాన్నిగదరగా, అదేం మడిసి? దాన్నబ్బాలు!

రక్తనాళాల్లో అతివేగంగా ప్రవహించి కామంతో నరాలు బద్దలవుతయేమో ననిపించింది. నాలు గడుగులు ముందుకేసి పరిసరాలు చూసేడు.

రాజమ్మ ఇల్లు రెండు గజాల దూరంలో ఉంది.

'సీత్తెరీ! అలవాటుపడ్డకాళ్ళు!' నవ్వుకొన్నాడు.

నాలుగంగల్లో రాజమ్మ ఇల్లు చేరేడు. లోపల బెడ్ లైటు మందంగా వెలగటం కిటికీలో గుండా కనబడుతోంది.

'ఇప్పుడేం జేత్తుంటాది? సీరెమార్పు . . .'


ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

# సౌమ్య ఉగాది నవలల పోటీ

# రు. 11,000 బహుమతులు

ప్రతి ఏడాదివలెనే సౌమ్య ఉగాది సందర్భంలోనూ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక నవలల పోటీ నిర్వహిస్తున్నది. కీలక ఉగాది నవలల పోటీకి 10,000 రూపాయల బహుమతులు ఇచ్చాము రచయితలను ఇతోధికంగా ప్రోత్సహించే లక్ష్యంతో సౌమ్య ఉగాది నవలల పోటీకి 11,000 రూపాయల బహుమతులు ఇవ్వడానికి నిశ్చయించాము.

రచయితలు, రచయిత్రులు ఈ అవకాశం వినియోగించుకొని పాఠకులకు ఉత్తమమైన నవలలు అందజేయాలనే మా సంకల్పం సఫలం కావడానికి తోడ్పడాలని అర్థిస్తున్నాము.

మొదటి బహుమతి రు. 5,500

రెండవ బహుమతి రు. 3,300

మూడవ బహుమతి రు. 2,200

**పోటీలో పాల్గొనేవారు పాటించవలసిన నిబంధనలు ఇవి:**

1 రచన 250 అంతావు 8"×12" సైజు కాగితాలకు మించరాదు.
2 సిరాతో కాగితానికి ఒక ప్రక్కనే వ్రాయాలి.
3. ఇతివృత్తం ఆంధ్రుల జీవితానికి సంబంధించినదై ఉండాలి.
4. స్వీయ రచనలేకాని అనువాదాలు పంపరాదు.
5. కవరుమీద 'ఉగాది నవలల పోటీకి' అని స్పష్టంగా వ్రాయాలి.
6. బహుమతులు పొందని రచనలలో యోగ్యమైనవి ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురించే హక్కు మాకున్నది.
7. బహుమతి పొందని రచనలలో ప్రచురణార్హం కానివాటిని తిప్పిపంపే నిమిత్తం తగుమాత్రం తపాల బిళ్ళలు అంటించిన, చిరునామా ఉన్న కవరు జతపరచి పంపవలసిఉంది. లేకపోతే వాటిని తిప్పిపంపడం జరగదు.
8. రచనలు 'ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు—2'కు పంపాలి.
9. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపబడవు.
10. ప్రచురణకు ఏ కలంపేరో ఉపయోగించినా, తమ అసలు పేరును విధిగా వ్రాయాలి.

ప్రథమ బహుమతి పొందిన నవల ప్రచురణ ఉగాది ప్రత్యేక సంచికలో ప్రారంభం అవుతుంది.

రచనలు మాకు చేరవలసిన ఆఖరి తేదీ:
**1969 జనవరి 10**

ఆంధ్రప్రభ
సచిత్ర వారపత్రిక

ప్రకటన రేట్లు

కాజావల్: కాలం సెం. మీ. 1 కి రు. 7-50
కంట్రాక్టు: కాలం సెం. మీ. 1 కి రు. 6-80
( 250 సెం. మీ.లు, ఆపైన
( ప్రకటనకు కనీస స్థలం
సిం. కాలం 5 సెం. మీ. లు

అట్ట పేజీలు :

4 వ పేజీ - రెండు రంగులు

కాజావల్: ప్రకటన 1కి రు. 1,100/—
కంట్రాక్టు: ప్రకటన 1కి రు. 950/—
( కనీసం 6 ప్రకటనలు )

2 వ పేజీ, 3 వ పేజీ -
ఒక రంగు

కాజావల్: ప్రకటన 1 కి రు. 700/—
కంట్రాక్టు: ప్రకటన 1 కి రు. 600/—
( కనీసం 6 ప్రకటనలు )

కొలతలు:

కాలం వెడల్పు 5 సెం. మీ.
కాలం నిడివి 23 సెం. మీ.
పేజీకి 3 కాలంలు

ఇతర వివరములకు దిగువవారికి వ్రాయండి:
అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్,
ఆంధ్రప్రభ
సచిత్ర వారపత్రిక
ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు-2
1-8-66 నుంచి ప్రకటనలన్నిటిమీదను
10% సర్చార్జి విధింపబడును.

ఒళ్లు పులకరించింది వాడికి. తొంగిచూసేడు.

రక్తం గడ్డకట్టినట్లయ్యి, నమ్మిన కాళ్లకింది భూమి కదిలిపోతున్నట్లనిపించింది. అవధులు దాటిన కోపంలో, కసితో తల పగులుతుందేమో ననిపించింది. ఒళ్లు తూలి పడబోయి తమాయించుకొన్నాడు.

ఆ నిమిషాన వాడికేం జెయ్యటానికీ తోచలేదు. మనస్సు గందరగోళమయింది. సద్దు చెయ్యకుండా వెనక్కి తిరిగి, ఆ ఇంటికి దూరంగా వచ్చి కాండ్రించి ఉమ్మేశేడు. మైకం పూర్తిగా దిగింది. విసురుగా రామాలయంకేసి నడక సాగించేడు.

* * *

కోటిగాడింటినుండి వెళ్లిన రెండు నిమిషాలకు వెంకటలక్ష్మిలేచింది. ఒళ్లంతా హూనమయింది. దవడ మీద కొట్టినచోట పన్ను కదిలి ఉప్పగా తగిలింది రక్తం. వాడు పిడిగుద్దు గుద్దిన చోట నరం కలుక్కుమంటూంది. ఏడుపుమాత్రం రావటం లేదు. ఇలా ఎందుకు జరిగిందన్న విషయమే వెంకటలక్ష్మి ఆలోచిస్తూంది. కుండలో చన్నీళ్లు కాసిని పుక్కిలించి ఉమ్మేసింది. కాసిని చన్నీళ్లు ముఖంమీద పోసుకొని కడుక్కుంది. రవంత సేదదీరినట్లయింది. వాడు జుట్టు లాగినచోట వెంట్రుకల కుదుళ్లు నొప్పెడుతున్నాయి. రేగిన జుట్టు వేళ్లతో సవరించుకొని, జరిగిన విషయాన్ని గురించి ఆలోచించసాగింది.

"ఎంతలేసి దెబ్బలు కొట్టేడు వాడు? అంత కోపమూ నగ ఇవ్వలేదనే? ఆ రాజమ్మమీద ఆడికంత మోజా! దానికాడంటే అంత ఇట్టమూ ఉందా? 'నగలేకపోతే నాకాడికి రాకు' అందేమో అది. ఈడు నగతెత్తానని సెప్పుంటాడు దానికి. అడగ్గానే ఇత్తానసుకొన్నాడు గామాల!

"ఎర్రోడు. నగ 'యియ్యలేదని మనసు కట్టబెట్టుకున్నాడేమో! ఆడికి దానిమీదంత మోజయితే తనాప గలదా? తనకు ఆడిమీద అంత ఇట్టంలేదూ! అదివ్వాళ్ల సొమ్మంటే పోద్దా? ఒక్కోళ్లకి ఒక్కోళ్లమీద ఇట్టం ఉంటంది గామాల! అయినా సిత్రం! తాను ఆణ్ని సానంకంటే ఎక్కువగా సూత్తుంది గందా! ఆడికి రాజమ్మంటే మనసు మరి! మరి దానికి?

'నగకోసం తన్నింత సావబాదేడంటె ఆడికి రాజమ్మంటే ఎంత బెమా తెలుస్తానే ఉంది. ఆడికంత బెమలు దానిమీదున్నాక యీ ఎదవ నగ తనకు సంతోసమిస్తదేంటి? సొమ్ము బంగమవుద్దనేకాని, ఆడు కావాల్నంటే తన తలకోసివ్వదూ! ఆడికి దానిమీద అంత మనసుంటే తనెందుక్కట్టపెట్టాల? ఎర్రి రామన్న! దానికెట్టా సమాదానం సెప్పాలా, అని బెంగెట్టుగున్నాడేమో! ఏమైనా ఆడిమనసు కట్టబెట్టగూడదు. ఆడు సుకంగుంటేనే ఏమైనా!'

దీపాన్ని కొడి దులిపి గూట్లో ఉంచి వెంకటలక్ష్మి లేచింది.

* * *

రామాలయం పక్కన అరుగుమీద కూచొని కోటిగాడు ఆలోచనల్లో పడ్డాడు.

'ఎంత గడ్డితిన్నాడు తను? ఈ తెగినముండకోసం, ఇయ్యాల ఆ ఎర్రిదాన్ని సావబాదేడు. ఆ కుక్క కెన్ని గుండెలు? ఇశ్వాసంలేని సిసిగ. ఆ దామిగాడితో . . .

'ధూత్! నీ యువ్వ. ఎన్నాళ్లనుంచో! ఎంత ఎర్రి యెదవయ్యేడు తను. ఇంకా నయ్యం. ఇప్పుడైనా కళ్లు తెరిసేడు. సీత్తెరీ! ఇంక దానిముకం సూత్తే చెప్పుతో కొట్టు. యథార్థాని కెంకట్లచ్మి ఎర్రిబాగుల్ది. దానికి తానంటే వల్లమాలిన పేమ. ఇన్ని దెబ్బలు కొట్టినా నోరు తెరిసిందా! ఏడుస్తా పడుకొందేమో!'

వాడి కొక్కసారి వెంకటలక్ష్మిమీద ప్రేమ పొంగొచ్చింది. ఇంటికేసి నడక సాగించేడు.

దార్లో ఒక్కసారి నిలుచొని చుక్కలకేసి చూశేడు. చుక్కలట్లాగే మినుకు మినుకుమంటూ చూస్తున్నయ్. చీకటి చిక్కబడటంతో చుక్కల కాంతికి ఆకాశం రవంత వెలుగు పుంజుకుంది.

'నేన్జేసిన యెదవపన్లన్నీ సుక్కలు సూత్తానే ఉండయ్ గామాల!' ఆ ఊహ రావటంతో వాడికి సిగ్గనిపించింది. చుక్కలకేసి చూళ్లేక తలొంచకొని చకచక ఇంటికేసి నడక సాగించేడు.

* * *

ఇంటిముందు వాకిలి కడ్డంగా పడుకొనుంది కుక్క. నిద్దరబోతోందేమో, అలికిడికూడా లేవలేదు. దాన్ని లేపే బుద్దెయ్యలేదు కోటిగాడికి. పక్కగా వెళ్లి తలుపు నెట్టేడు. ఇట్టే తెరుచుకొంది.

లోపలగూట్లో గుడ్డిదీపం, చివరదశ కొచ్చిందేమో నిశ్చలంగా, కాంతివంతంగా వెలుగుతూంది. గుడిసెలో వెంకటలక్ష్మిలేదు.

వాడికి మనసులో ఏమూలో భయం మెదిలింది. 'ఏ అగాయిత్తెమన్నా సేసికోలేదు గందా!''

బీడీ వెలిగించి గుప్పుగుప్పన పొగ వదిలేడు.

రెండు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచేయి. బుజం మీదిగా పైట కప్పుకొని, వీధి తలుపు తీసికొని వెంకటలక్ష్మి లోపల కొచ్చింది.

దానికేసి చూట్టానికి వాడికి ముఖం చెల్లలేదు. తప్పుచేసినట్లు తలొంచుకొన్నాడు.

నిండుగా నవ్వుతో అంది వెంకటలక్ష్మి.

"మగపుట్టకపుట్టి ఆ దిగులేంది? ఏదో ముందు సొమ్ము బంగమవుద్దని మొరాయించినా, తరవాత తప్పు తెలుసుకొన్నా. నీ సుకంకంటే నాకేం గావాల? రాజక్క విన్నేమనదులే! నేనే ఎల్లిచ్చొస్తుండావాంతాడు. ఇప్పుడే ఎల్తావా? అరె! ఏందది? ఎర్రిమొగుమల్లే అట్టా జూత్తవేం?''

దీపం ఆరిపోయింది.

తలెత్తిన కోటిగాడికి గుడిసె కప్పులో సుందా మెరిసే శుక్రుడు కనిపించేడు. ★